Andhra Jyothy

Dt- 24/09/17.



# మెట్రో స్టేషన్

# ఆల్ ఇన్ వన్..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలులో ప్రయాణం చేయకున్నా ఎంచక్కా మెట్రో స్టేషన్‌లో షాపింగ్ చేయొచ్చు. రోడ్లపై రద్దీ సమయాల్లో రోడ్డు దాటడం కష్టంగా ఉంటే.. మెట్రో స్టేషన్‌ను ఫుట్ ఓవర్ బ్రిడ్జిగా వాడుకోవచ్చు. రెండంతస్థుల్లో ఉండే మెట్రో స్టేషన్ మొదటి అంతస్థును రెండు ప్రాంతాలుగా విభజించారు. ఇందులో ఒకటి పెయిడ్ ఏరియా, మరొకటి పబ్లిక్ ఏరియా. పబ్లిక్ ఏరియాగా గుర్తించిన ప్రాంతంలోకి ఎవరైనా వెళ్లొచ్చు. అక్కడ ఉండే షాపుల్లో కొనుగోలు చేయొచ్చు. ఫుడ్ కోర్టులో భోజనాలు, ఎంటర్‌టైయిన్‌మెంట్ ఇంకా ఏటీఎం, మెడికల్ షాపులు, లాండ్రీ షాపులు ఇలా అన్ని ఒకే చోట ఉంటాయి. కావాల్సిన వస్తువులు,సేవల కోసం నేరుగా మెట్రో స్టేషన్‌కు వెళ్లచ్చు. అవసరమైనవి కొనుగోలు చేసి రైల్లో ప్రయాణం చేయకుండా కిందకు దిగి రావచ్చు. మెట్రో రైలు ఎక్కాలంటే మాత్రం టికెట్ కొని పెయిడ్ ఏరియాలోకి వెళ్లి, రెండో అంతస్థులో ఉన్న ప్లాట్‌ఫామ్‌పైకి చేరుకోవాలి. టికెట్ కొనుగోలు చేసిన తర్వాత ప్లాట్‌ఫామ్‌పైకి ప్రయాణీకులు వెళ్లేలా స్టేషన్ నిర్మాణం చేపట్టారు.



మెట్రో స్టేషన్ మొదటి అంతస్థులో ఉన్న పబ్లిక్ ఏరియా

## ఒక్కో మెట్రో స్టేషన్‌లో 18 షాపులు..

మెట్రో మొదటి దశలో మూడు కారిడార్‌లలో 72 కి.మీ మేర నిర్మిస్తున్న ప్రాజెక్టులో మొత్తం 64 మెట్రో స్టేషన్‌లు ఉంటాయి. ఇందులో 55 స్టేషన్‌లు ఒకే విధంగా ఉంటుండగా, 3 ఇంటర్ చేంజ్ స్టేషన్‌లు అమీర్‌పేట, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్ వద్ద,




మరో నాలుగింటిని స్పెషల్ స్టేషన్‌లుగా పరిగణిస్తున్నారు. నడిరోడ్డుపై ఉన్న మెట్రో స్టేషన్ చేరుకునేందుకు నాలుగు మార్గాలు ఉంటాయి. వీటి ద్వారా లోపలికి వెళ్లే మొదట పబ్లిక్ ఏరియాలోకి వెళ్తారు. అక్కడే వ్యాపార సంస్థలు ఉంటాయి. అదే సమయంలో రోడ్డుకు ఒకవైపు నుంచి మరోవైపు వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిగా ఆ ప్రాంతం ఉంటుంది. ఆ సమయంలో షాపింగ్ చేయొచ్చు. ఇంటర్ చేంజ్ స్టేషన్‌లు మాత్రం మూడంతస్థుల్లో ఉంటాయి. ఇక్కడ మాత్రం ఎక్కువ మొత్తం స్థలం, సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. రెండు కారిడార్‌లకు సంబంధించిన ప్లాట్‌ఫామ్స్ రెండు, మూడు అంతస్థుల్లో ఉంటాయి. ప్రతి మెట్రో స్టేషన్‌లో రిటైల్ షాపింగ్ కోసం 2500 చదరపు అడుగుల నుంచి 9వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయిస్తున్నారు. ఇక ఇంటర్‌చేంజ్, స్పెషల్ స్టేషన్స్‌లో అయితే మాత్రం 10వేల చదరపు అడుగుల నుంచి 40వేల చదరపు అడుగుల స్థలం వ్యాపార కార్యకలాపాల కోసమే కేటాయిస్తున్నారు. ఇంటర్‌చేంజ్ స్టేషన్‌లలో ఎలక్ట్రానిక్ స్టోర్స్‌తో పాటు ఎంటర్‌టైయిన్‌మెంట్ థీమ్స్ ఏర్పాటు చేయనున్నారు.



పెయిడ్ ఏరియా